# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 1, నవంబరు, 2014

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత తీవ్రంగా ఉన్నందున రైతులకు చాలినంత విద్యుత్ సరఫరా చేయలేకపోతున్నామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు చెప్పారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రబీ సీజన్‌లో రైతులు వరి పంటలు వేయకుండా సహకరించాలని, ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత తీవ్రంగా ఉందని, విభజన బిల్లు ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ సరఫరా చేయకపోవడం వల్ల విద్యుత్ సంక్షోభం ఏర్పడిందని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణలో విద్యుత్ వినియోగం కూడా బాగా పెరిగిందని, రాష్ట్రం కలిసి వున్నప్పుడు రెండు ప్రాంతాల్లో ఉన్న డిమాండ్ కన్నా కూడా ఇప్పుడు తెలంగాణలో డిమాండ్ ఎక్కువగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ పరిస్థితిని తట్టుకోవడానికి శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నామని, పవర్ ఎక్స్ఛేంజ్ నుండి కూడా పెద్ద ఎత్తున కరెంట్ కొనుగోలు చేశామని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రయత్నాల వల్ల ఖరీఫ్‌లో విద్యుత్ సరఫరా చేయడం సాధ్యమైందన్నారు. అయినప్పటికి రైతులకు కావలసినంత విద్యుత్ ఇవ్వలేకపోయామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణకు రావలసిన 54 శాతం కరెంట్ అందించడం లేదని, శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తికి అడ్డుపడుతున్నదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలు కూడా ప్రజలు చూస్తూనే ఉన్నారని, వాటిని ఎప్పటికప్పుడు ఎదుర్కుంటూనే ఉన్నామని ముఖ్యమంత్రి వివరించారు. విభజన బిల్లును అమలు చేయించాల్సిన కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణకు సహకరించడం లేదని, తెలంగాణ పట్ల కక్ష సాధింపు ధోరణితో కేంద్రం వ్యవహరిస్తున్నదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు పెట్టలేదని, ఫలితంగా తెలంగాణ విద్యుత్ కొరత ఎదుర్కుంటున్నదని చెప్పారు. తెలంగాణలో రెండు మూడేళ్ల పాటు కరెంట్ కష్టాలు ఉంటాయని, తాము ఎన్నికల సమయంలోనే ప్రజలకు చెప్పామని కూడా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ నుండి 1000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని, తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను కూడా నిర్మిస్తున్నామని, ఏడాది రెండేళ్లలో పరిస్థితి కొంత మెరుగవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. మూడేళ్లలో కరెంట్ కష్టాలన్నీ తొలగిపోతాయని వెల్లడించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో మాత్రం రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని ముఖ్యమంత్రి రైతులను కోరారు.

---

సిపిఆర్ఓ టు సిఎం